



# ఒక తండ్రి


గోపి (అల్లం రాజయ్య)


బుచ్చిరెడ్డి హఠాత్తుగా మంచంలో లేచికూర్చున్నాడు. అతని మోకాళ్లు ఫలఫల శబ్దంచేశాయి. అరుగుకిందికి దిగి ఆకాశంకేసి చూశాడు. అమాసరోజులు చిమ్మం చీకటి. పైగా ఆకాశంలో చిక్కగా మబ్బులు పట్టాయి. రెండిండ్ల మధ్య ఆకాశం ముక్క చాప వెడల్పే ఉన్నది.

"తెల్లారిందో ఏందో?" గొనుక్కుంటూ దరువాజ తీసి వాకిట్లో కొచ్చాడు. చిమ్మెట్లు రొదగా అరుస్తున్నాయి. వీధిలైటు చుట్టు ఉసిల్లు మూగుతున్నాయి. నిన్న సాయంకాలమే పెద్ద జడివాన కురిసిపోయింది. గడ్డం గోక్కుంటూ అకాశంకేసి చూశాడు. ఆకాశంలో ఎక్కడా ఒక్క చుక్క కన్పించలేదు. ఊళ్లె చప్పుడులేదు.

బుచ్చిరెడ్డి ఆరాత్రి తెల్లారిందో లేదోనని చూడడం ఇది మూడోసారి. ఆరాత్రి బుచ్చిరెడ్డి అసలు నిద్రపోనే లేదు.

"ఏమే ఇయ్యేడు ఏమారం కార్తులే" అను కుంటూ ఇంట్లో కొచ్చాడు.

తలుపు తీసినప్పుడే తెలివైన సుగుణమ్మ "నాత్రంత కన్ను మీద కునుకు పడనియ్యక పోతివి. లేడికి లేచిందే పరుగన్నట్టు నీ ఉరుకులాట నీదేగాని..."

"అరె ఇయ్యల్ల గయ్యన్ని మాట్లాడకు. తల్లి కడుపులనుంచి ఇప్పుడే పుట్టినట్టుగున్నది."

"ఊ" సుగుణమ్మ బుచ్చిరెడ్డి అంతరంగంలోని ఘర్షణ తెలియక ఎప్పటిలాగే అన్నది.

"ఊ లేదు ఆ లేదు. కార్తులు ఏవారమచ్చి నయ్."

"నిన్ననే రోని (రోహిణి) బోయి మురకశిలె (మృగశిర) జొచ్చింది. కార్తిసందు నిన్న ఆనగూడ కొట్టిందికాదా?"

"అయితే అయితారం కార్తులన్నమాట."

"మునిమాపులేసి కార్తులడుగుతున్న వేంది?"

"పెరట్ల పెసలు అలుకాలె."

"బాగానే ఉంది పనివరుస ముసలితనానికి దసిలిరైకన్నట్లు గిప్పుడు నువ్వు గుంటుక కొడ్తవా? అంత సాపు సీదగున్నదని ఇగ గదొక్కటి తక్కువయ్యిందా?"

"ఎట్ల జరిగేది గట్ల జరుగుద్ది. బిన మనసేతుల లేనప్పుడు ఊకె రంధిపడి ఏంజేత్తం. ఈ భూ మండలంల ఎవరు సావకుంట బతికెటోల్లు లేరు. రెక్క లచ్చిన పచ్చులు ఎగిరిపోయినయి..." ఇంకా ఇలాటి మాటలేవో మాట్లాడుదామనే అనుకున్నాడు. కాని అతనికి మధ్యలోనే 'గుంటుక' జ్ఞాపకం వచ్చింది. లేచి ఇంటి ముందటనే గల ఎడ్ల కొట్టంలోకి వచ్చాడు. రెండు ముసలెడ్లు చొప్పలేక బుచ్చిరెడ్డిలాగే బక్కపీలి ఉన్నాయి. వాటి ముందుకు వెళ్లగానే బుచ్చిరెడ్డి ఒంట్లో నుండి వేడిపొగలు చిమ్మాయి. తనబాధల్లో తనుండి "నోరులేని జీవాల మిమ్ముల మాడ్సినగదరా?" అని వాటికి సంజా యిషీ చెప్పుకున్నాడు. రెండెడ్ల గంగడోలు రాశాడు.

"ఒరే గంగదేవి ఇయ్యల్లనే నూరువోనియ్యి, నూటయాభై పోనియ్యి కంట్లం జొన్నసొప్ప దెత్త. తినుండ్లి బిడ్డ తినుండ్లి. ఇగ మీరే నాకొడుకులు." ఎడ్లకు అతని మాటలకన్నా అతని చేతలప్రేమ అర్థమై నట్లున్నది. అవి ఆబగా అతని చేతులు నాకినాయి. కొత్త ఉత్సాహవేందో వాటి ఒంట్లోకి ఎక్కినట్లైంది. మట్టుమీదనే అటిటు తిరి గాయి. అటుకు మీద పెట్టిన వరిగడ్డ పంజ తీసి వాటి ముందు పెట్టాడు.

బుచ్చిరెడ్డికి ఎన్నెన్నో అనుభూతులు, కోప తాపాలు, సుఖదు:ఖాలు మనుసులో పోటెత్తాయి. గత మూడు సంవత్సరాలుగా బుచ్చిరెడ్డి కలలో బతికినట్టు

బతుకుతున్నాడు. ఎక్కడ మొదలైన ఆలోచనైనా పుటుక్కున మధ్యలో తెగిపోయి పొట్టకొచ్చి ఉండిపోయిన వరిపొలం చూసి నివ్వెరపోయిన రైతులా ఊరికినే చేష్టలుడిగి ఉండిపోయాడు. ఈ మూడు సంవత్సరాల బతుకులో అతను తన సొంతం జీవితాన్ని ఆ బతుకులో తారసపడ్డ మనుషులు ఆఖరుకు ప్రతి చిన్న ఘటనను కొత్తకోణంలో చూశాడు. ఒక ఉద్విగ్నమైన స్థితిలో బతికాడు.

"అయ్యన్ని మల్ల తవ్వుకొని ఫాయిదాలేదు. బతుకాలె. తన డెబ్బైయేండ్ల బతుకులో తలవంచకుండ బతికినట్టే బతుకాలి. ఏ కట్టానికి జెనుకలేదు. సచ్చె తుదకు జెనికేదేంది? ఎట్ల కానున్నది అట్లయితది." లోపటి ఆలోచన పైకే అనుకున్నాడు.

గుంటుక ఎక్కడ పెట్టాడన్నది ఎంతకు జ్ఞాపకం రాలేదు. పశువుల కొట్టానికి వేసిన 'గెల్లాలల్లో' పుని కాడు. ఆ కర్ర మొద్దుల్లో ఆ చీకట్లో గుంటుక అనవాలే దొరకలేదు.

సుగుణమ్మ బయటకు లేచివచ్చి "ఔ ఇగమన లచ్చన్న రానట్టేనా?" అన్నది.

"గట్లనే కన్పడుతుంది?"

"ఆడిటు తొంగి చూడకపోవుటానికి ఆని పురెల బుద్దేనా?"

"కావచ్చు," అటుక్కు పెట్టిన వాసాలు పునుక్కుంట.

"ఎంగలరావో దొంగలరావో సచ్చిండుగదా!"

"ఔ సంపకుంటె ముద్దుపెట్టుకుంటరా?"

"డెబ్బయేండ్లచ్చే మనుమలకు కొడుకులు బుట్టిరి నీ బుద్ధి మారకపోయే."

అదే నిన్న సాయంత్రమైతే బుచ్చిరెడ్డి ఆగ్రహోద్రంగా ఊరు పేరు లేకుండా తిట్టేవాడు. చిమ్మెట్ల రొదలో ఎడ్లు వరిగడ్డిలో మూతులతో గెలుకుతున్న చప్పుడులో మౌనంగా నిల్చున్నాడు.

"అయినా మంచోడేనటగదా?" సుగుణమ్మ రెట్టించింది. ఆమెకు కీళ్లనొప్పులు. దరువాజ ముందు కూర్చున్న చప్పుడు.

"అందరు మంచోళ్లే కానోడెవ్వడు. మీకందరికి ఇన్నూరెకరాలోడు, నూరెకరాలోడు మంచోని తీర్గనే కన్పడ్తరు. ఆడు కడుపుల సల్ల కదులకుంట నీతి ముచ్చెట్లు సెప్పుతడు... గీపదిహేనేండ్లల్ల..." ముసలాయనకు ఏదో జ్ఞాపకంవచ్చి గొంతు బొంగురు పోయింది.

"కడుపుకోత- ఎంతమంది మనసొంటి ముసలోల్లు ఏడ్సేడ్సి సత్తండ్లు. ఇది బక్కగొడ్ల ఏడుపుకు గద్దలాగే కాలంకాదు. గిది ఇజ్జెం... లథాయి..." ఇంకా చాలా చెప్పాలనుకున్నాడు కాని మాటలు తెగిపోయి ఆ తెల్లారే సమయంలో భల్లున ఏడుస్తానేమోనని భయపడిపోయాడు.

సుగుణమ్మ అడుగులేకపోయింది. ఆమెకు నాభి లెక్కడో కలుక్కుమన్నది. వాళ్లిద్దరి మాటలు ఎక్కడ మొదలేసినా ఇద్దరు వద్దనుకున్న విషయం దగ్గరే ఆగిపోతాయి.

"వానింట్ల పీన్గెల్ల వాడు సత్తె సచ్చిండుగని మల్ల ఊల్లకుగ్గం అచ్చెటట్టున్నది. లచ్చన్న గందుకనే రాలేదనుకుంట" అన్నది.

"కావచ్చు. గిదికొత్తనా? ఎన్నిపారీల కాలేదు. దెంకపోయెటోడు చెంగో బిల్ల అన్నడు. ఏడికి పోతరు? పిరికోనికి ఏడికిబొయినా," అటుక్కు పెట్టిన గుంటుక దొరికింది. దాన్ని తిప్పలుపడి బయటకుతీశాడు. రిమ్మెన కొయ్యలు ఎక్కడ బెట్టిండో మళ్లీ జ్ఞాపకం రాలేదు.

"ఏందది?"

"గుంటుక."

"మరినీ శాతనైతదా? పెద్దోడు మోయేడు సేత సేపిచ్చి ఆడు మరి బాపు అమ్మ సచ్చిండ్లో బతికిండ్లోనని తొంగన్న సూడకపాయె. అందరికి పగైపోయినం. నడిపోడు మున్నూర్రూపాల నౌకరిల పిల్లంబేరం గొడుత్తండు."

"ఆడేంజేత్తడే నర్సొక్కులోడు. సరెగాని. రుమ్మెన కొయ్యలు, పొన్నులు ఏడబెట్టిన. మతికత్తలేదు."

"గుమ్ములకాడ బెట్టినట్టున్నది. ఇంక పుంజు అన్న గుయ్యలే." సుగుణమ్మ లేచి ఇంట్లోకి వెళ్లి దీపం ముట్టించి గుమ్ముల సందులో వెతికింది. పొన్నుల కోసం గూళ్లన్ని వెతికింది.

అప్పటికి బుచ్చిరెడ్డి గుంటుక వాకిట్లోపెట్టి రుమ్మెన అమర్చాడు. తాళ్లకోసం గాలిస్తున్నాడు... భార్య తెచ్చిన కొయ్యలు అమర్చాడు. పలుగుకోసం, బారెడు బొత్తెల కోసం, పగ్గాల కోసం మళ్లీ వెతుకులాట. అన్నీ దొరికాయికాని పొట్టెమట్టుదాడు లేనేలేదు. అయినా బుచ్చిరెడ్డి వొదిలిపెట్టదల్చలేదు. జనుప గిర్రసేరు తెచ్చి ఎట్లాగైనా కట్టాలని చూశాడు- అన్నీ అమర్చిన గుంటుక పాతబడి లుకలుక లాడుతోంది... లాభంలేదు వడ్లాయన దగ్గరకిచ్చి పేళ్లు వేయించాల్సిందే.

ఇంటి ముందు బొడ్డు మల్లెచెట్టు మొదట్లో దిగాలుపడి కూర్చున్నాడు.

"నీతోని వశంగాదయ్యి నువ్వు పోరనివిగాదు పడుసోనివిగాదు. ఎప్పుడు ఉరుకులాటే," సుగుణమ్మ లోపలికి వెళ్లిందిగాని, 'ఇట్లాగైనా కొంత మనిసి ఏదో పనిమీద పడుతడు. రెక్కలు తెగిన పక్షుల్లా ఇద్దరు ఈ ఇండ్లల్ల ముసలి దయ్యాల తీర్గ ఏడుత్తె ఎవలేమను కుంటారో నంట తిరుగుతన్నం. ఒకప్పుడు కళకళలాడిన ఇల్లు.' సుగుణమ్మ బారెడు గాలొదిలింది. మంచంమీద కూర్చున్నదేగాని మనసంతా బుచ్చిరెడ్డి మీదనే ఉన్నది. మళ్లీ లేచి వచ్చింది.

సడీసప్పుడు లేకుంట చెట్టు కింద సీకట్లో కూర్చున్నాడు బుచ్చిరెడ్డి. వీధిలో కరంటు వెలుగు.

"కాసేపు అట్ల కూరుకుదువురా! ఇంక పుంజు గుయ్యలేదు." అన్నది.

బుచ్చిరెడ్డి మళ్లీ వచ్చి గుంటుక ఊపి చూసిండు. గాడీలల్ల వరిగడ్డి దగ్గర చేశాడు. ఇంట్లోకి వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

సుగుణమ్మ తలుపేసి తను ఎదురింటి అరుగు మీది మంచంలో ఒరిగింది.

బుచ్చిరెడ్డి అట్లా ఎంతసేపు కూర్చున్నాడో తెలియదు.

తొలికోడి కూసింది- వీధిలో సందడి మొదల య్యింది.

బుచ్చిరెడ్డి బయటకు వచ్చాడు. చింతచెట్లల్లో గాలిగమ్మత్తుగా రొదచేస్తోంది. తూరుపుదిక్కు చాపెలుపు చుక్కలు కన్పించాయి.

వీధిలో జనుప కాగడాలు మంటవేసి ఉసిల్లు పడుతున్నారు. మూలమలుపు దగ్గరి వీధిలైటు ముందు స్త్రీలు పురుషులు అగమాగంగా కుండలు గంజులు పట్టుకొని చీపుర్లతో ఉసిల్లు ఊడ్చి ఎత్తుకుంటున్నారు... ఉప్పరివాడకు, గొల్లవాడకు మంటల కొసలు కన్పిస్తు న్నాయి.

బుచ్చిరెడ్డి గుంటుక భుజంమీది కెత్తుకున్నాడు. ఆ బరువుకు తూలి నిలదొక్కుకున్నాడు.

వడ్లాయన కైలాసం గోచీ ఊచిపోగా లైటు వెలుతురులో ఉసిల్ల కోసం ఆడికీడికి ఉరుకుతున్నాడు. మధ్యమధ్య, "హన్నా నీయక్క - పెద్దబాడిసెతోని నరుకుతునా?" అంటున్నాడు.

అతని భార్య పొట్టి వరమ్మ తిడుతోంది. బరిబాత ఆడపిల్లొకతి ఏడుస్తోంది.

చింతకింద ధాతికాడ గుంటుక దించాడు.

"ఇగ నా వశంగాదు," అని భార్యకు గిలేటి సర్వయిచ్చి ధాతికాడికొచ్చి బుచ్చిరెడ్డిని చూసి బోలెడంత ఆశ్చర్యపడి, "ఇగ ఇయ్యేడు అయ్యింది పో- గుంటుక లకు బోయినోళ్లు గుద్దుకుంటత్తరు," అన్నాడు నవ్వుతూ.

"అదెరా పిలడా?" బుచ్చిరెడ్డి నవ్వుతూ.

"అవ్వ నీ బాంచెన్ మూడేండ్లాయె నీ ముసుం నవ్వు సూడక," ముఖం మీద ముసురుతున్న ఉసిల్లను కొట్టుకుంట.

వీధిలైటు వెలుతురులో బుచ్చిరెడ్డి మొఖం పరిశీలనగా చూసి, "నీకెందుకు గీతిప్పలు- బొచ్చెల సొంటి నలుగురు కొడుకులు. ఏడున్న పూట గడుత్తది. గీ పాతులాట నీకెందుకయ్యా," కైలాసం ఇందాకటి నవ్వు మరిచిపోయి.

"ఊకెనే ఉంటె దోత్తలేదోయి. నిన్న మొన్నటి దాకా మా లచ్చిరెడ్డి అత్తడొంటజూసిన. వాడింక రాక పాయె. మారెగీ ఏద్దు ముడ్డి పొడుసుక బతికినోడు ఏడ బతకలేడు. పునాస అలికినంక జూత్త," అన్నాడు.

ఇంట్లోనుంచి చిన్నబాడిసె ఉలితెచ్చి గుంటుక మీద రెండు దెబ్బలేసి, "మారేగిది బనికచ్చేటట్టులేదు. నా తీర్గనే లుకలుకలాడుతంది," అన్నాడు.

"ఎరంబెట్ట లేదని సూడకు - మీ వోళ్లను ఇంటికి దోలు. ఇయ్యల్ల పనిసాగియ్యి. రేపు సూద్దాం."

"ఎరం ఎవలడిగిండ్లయ్యా - మారాజు ఏడున్నడో నాకు అన్నం బెట్టి తను దేశాలు బట్టి పోయిండు," కైలాసం చెక్కేదాన్ని చెక్కిపెడుతూ.

బుచ్చిరెడ్డి మాట్లాడలేదు. ఆ మతికి వద్దు - ఆ ఆలోచనలే ప్రస్తుతానికి వద్దనుకుంటున్నాడు... ఆ మాటలు పదేపదే సుళ్లు తిరుగుతాయి. తను సర్వ చేష్టలుడిగి మూడేండ్ల నుండి ఎట్లా పనిపాట లేకుండా ఉండిపోయాడో అట్లాగే ఉండదలుచలేదు.

కైలాసం ఏదో మాట్లాడుతున్నాడు. ఆ మాటలు వినకుండా బుచ్చిరెడ్డి, "రేపోమాపో వడ్లు అలుకాలె- ఎడ్లకు సొప్పగొనాలె- మడికట్టుకు నాలుగు నాగండ్లు కూలికి బెట్టుకుంటే నాటైపోతది."

అప్పటికి ఇంకో ఇద్దరు రైతులు వచ్చారు. వాళ్లు బుచ్చిరెడ్డిని మందలించారు. అరకొరగా ఏదో చెప్పి గుంటుక ఎత్తుకొని నడుస్తున్నప్పుడు అన్పించింది. తను వాళ్లతో అట్లా మాట్లాడాల్సింది కాదు. ఎంతకాలం

భయపడతాం. ధైర్నెం తెచ్చుకోవాలి. అచ్చిన కట్టం, సచ్చిన తప్పదు. మొదట తనకు కాలుచెయ్యి ఆడితే...

అతను కొంచెం సందుబెట్టగానే వారం రోజుల క్రితం వచ్చిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది. బనీను జేబు తడుముకున్నాడు. ఒంట్లో కీళ్లన్ని పట్టు తప్పినట్టు డీలా పడిపోయాడు. "వాడు ఎంతో ఆశతో ఉత్తరం రాస్తే తను పోలేకపోయిండు. కోరాపుట్ ఎక్కడుంటదో ఎవరినో అడిగితే కాజీపేటల రైలెక్కుతే అక్కడికి సీదా పోతదట. పొద్దున ఎక్కుతే తెల్లారి దిగాల్నట- అయిదారు వంద లన్నా కావాలె - పెద్దోడు చాలా దూరంలున్నడు. వాన్ని అడుగదలుచుకోలేదు. ఈ మాటే వాడికి చెప్పవద్దు- నడిపోడు ఆగన్న పక్షి తిరుగుతండు. చిన్నోడు మా కొట్టి పోసుకుంటండు గాని వాని దగ్గర పది రూపాయలు దొరుకయి... వాళ్లను ఎందుకడుగాలె... ఏదో ఒకటి అమ్ముత..."

ఇంతలోనే ఇల్లు వచ్చింది. సుగుణమ్మ ఆకిలి ఊడ్చి అలుకు జల్లుతున్నది...

గుంటుక దించి మళ్లీ బలం పుంజుకోవడం కోసం ఆలోచనలన్నీ దూరం కొట్టి ఎడ్లను గుంటుక్కు కట్టాడు. గుంటుకు కర్రుమని బకాట్లో గీరుతూ నడుస్తున్నది.

అప్పటికి తూరుపు రేకలు బారుతున్నాయి.

*

బుచ్చిరెడ్డి కురుపెకట్టెతో కొండ్రలు గీయడానికి ప్రయత్నం చేశాడు. చేతులు వణుకుతున్నాయి. కొండ్రలు వంకర టింకరగా వస్తున్నాయి. అది రెండె కరాల గుడ్డం. పడమటి వేపున పెద్దబావి. దానినానుకొని ఇంకో రెండకరాల పొలం ఉన్నది. దాని గడ్డమీద కరంటు మోటర్ షెడ్డు - షెడ్డు చుట్టూ జామ, నిమ్మ చెట్లున్నాయి.

అప్పటికి తడిసిన మట్టిమీద బంగారు తీగల్లాగా ఎండ పొడమెరుస్తోంది. సీతాకోక చిలుకలు, దువ్వెన్లు, అప్పటికి రెక్కలూడని ఉసిల్లు ఎగురుతున్నాయి. ఉసిల్లపేటలో పక్షుల మందలు ఎటుచూస్తే అటు నాగండ్లు, గుంటుకలు, రైతుల ఎడ్ల అదిలింపులు- పిలుపులు అరుపులు.

గెట్టు మీదికొచ్చి బుచ్చిరెడ్డి నిలుచున్నాడు. ఊరుదిక్కు చూశాడు. ఊళ్లో గుడిసెల కప్పుల్లో నుండి పొగలు దట్టంగా లేస్తున్నాయి.

పక్క పెరట్లో కొమురమ్మ, శంకరయ్య మక్కలు వేస్తున్నారు. శంకరయ్య ఉరుకులు పరుగుల మీద నాగలి నడుపుతున్నాడు. ఆ నాగలివెంట మక్కలెయ్య లేక కొమురమ్మ గొనుగుతోంది. వాళ్ల పెద్ద బిడ్డ చంకలో పిల్లవాన్ని మట్టిలో దింపేసి ఆరుద్ర పురుగులను ఏరుతోంది.

"ఓపోరీ! తమ్మున్నెత్తుకోవే" కొమురమ్మ అరి చింది. మట్టిలో పిలగాడు నాగలికేసి పాకుతూ ఏడు స్తున్నాడు. పిల్ల విన్పించుకోలేదు.

బుచ్చిరెడ్డి తన పని మరిచిపోయి పిల్లవాన్ని ఎత్తు కున్నాడు, శంకరయ్య నాగలి ఆపిండు.

కొమురమ్మ వచ్చి, "పెదనాయన్నా! రాత్రినుంచి పాలు చీకలేదు. ఈయినేమో ఇప్పుడే ఆనకాలం బూని నట్టు చేత్తండు," పిల్లవాన్ని తీసుకొని గట్టు మీద కూర్చుండి రొమ్ము నోట్లో పెట్టింది.

శంకరయ్య వచ్చి అక్కడి వాలకం చూశాడు.

చిన్న అంచెలో పెసల్లు, వంకర గీతల కొండ్రలు, గుంటుక మీదనే నెమరేస్తున్న ఎడ్లు...

శంకరయ్యతో బుచ్చిరెడ్డి మాట్లాడక దాదాపు ఆరేండ్లవుతున్నది. ఒకప్పుడు శంకరయ్య ఆ వూరి రైతు కూలి సంఘం అధ్యక్షుడు... ఆ తరువాత బుచ్చిరెడ్డికి ఎన్నో జ్ఞాపకం వచ్చాయి.

నిజానికి బుచ్చిరెడ్డి శంకరయ్య దిగజారిపోయా డనుకున్నాడు. శంకరయ్య కురుపెకట్టె తీసుకొని ఎకరం కొండ్రలేశాడు. "నీనుంచేమయితదె లచ్చిరెడ్డి అన్నా రాకపాయె," శంకరయ్య.

ఆ పొడిమాటలకే బుచ్చిరెడ్డి గుండె రెపరెప లాడింది. ఇన్ని రోజులు అందరు దేనికో దానికి లొంగి పోయిన వాళ్లుగానే చూశాడు. అందరు మాకేమస్తదనే లెక్కలు కట్టేవాళ్లే అనుకున్నాడు.

కాని వీళ్లంతా నెత్తురు మాంసాలున్న మనుషులే.. వాళ్లకు చెప్పలేనన్ని బాధలు, బంధాలున్నాయి.

ఆ ఆలోచన తనకే కొత్తగా అన్పించింది.

పంచె ఒడి కట్టుకొని పిడికెడు పెసల్లు తీసి నేల మీద జల్లాడు. ముసలితనం వలన చెయ్యి వనుకు తోంది. పెసల్లు కొండ్రలో పడటంలేదు.

"ఎవలనన్న కైకిలి పెట్టకపోయినా? మనుసాగక వచ్చినవ్‌గాని," శంకరయ్య పెసల్లు కూడా తనే అలికాడు.

బుచ్చిరెడ్డి ఒక్క మాట మాట్లాడలేదు. ఎన్నెన్నో చెప్పాలని ఉన్నది. ఈ ఆరేండ్ల కడుపుల ముచ్చెట్లు ఊరికి సంబంధించినవి. మూడేండ్ల ముచ్చెట్లు వాళ్ల రెక్కల్లబొక్కల్ల మెదిలిన చిన్న కొడ్కు గురించినవి.

శంకరయ్య మళ్లీ నాగలిపట్టాడు. కొమురమ్మ మక్కలేస్తున్నది.

"పాపం నలుగురు కొడుకులుండి ముసలో ల్లిద్దరు గీ ఊళ్లె ముసలి గువ్వల తీర్గున్నరు," కొమురమ్మ.

శంకరయ్య మాట్లాడలేదు.

"పెద్దకొడుకు ఓరంగల్లుల పెద్దనౌఖరేనటగదా! అడికన్న పోతేంది?"

"మట్టిని నమ్ముకున్నోడు ఆడికిబోతె పిస్సల పడ్తడు."

"మరి లచ్చిరెడ్డన్నా ఇల్లు వట్టుకొని ఉంటేంది?"

"ఉండనిత్తరా? పోలీసోల్లు - మీ తమ్ముడేడని బెదిరిచ్చుడు. ఎన్ని పారీలు ఠానచుట్టూ తిరిగి సావ లేదు."

"చిన్న పొలగాడు ఇప్పుడు ఏడున్నడో-ఆయినె పోయినకాన్నుంచి మన ఊళ్లె."

"నాకే మెరుక?"

"అబ్బో నీ కెరుక లేకుంటుంటదా? చెప్పవుగని."

"నాకు చెప్పిపోయిండా? ఏంది?"

"అక్కడెక్కన్నో నూటయాభైరూపాల సార్జి తలిగే అవుతల జేల్లున్నడట- తండ్రికి ఉత్తుర మేసిండట."

"చింతకింది రాయక్క నశ్యం దంచుకోనుబోతె సుగుణవ్వ చెప్పుకొని ఏడ్సిందట- ఔగని మీరేం మను సులు. అయినె కొడుకున్నంత సేపు వాళ్లింటికి బోతిరి. ఆయింక బందయితిరి. ముసలోడు నా ఎరుకల నుంచి నికార్సు మనిషి, మీరంత- ఆయన కాల్రెక్కలిరి పిత్తిరి."

శంకరయ్య దీనికేమి జవాబు చెప్పలేదు. అతని దగ్గర జవాబులేదు. ఇవ్వాళ్ల పరిస్థితి మారింది...

భర్త మౌనం చూసి, "ఎట్లయినా ఓడ దాటేదాక ఓడ మల్లప్ప ఓడ దాటినంక బోడ మల్లప్ప అంటే ఎట్ల... తిరుపతిరెడ్డి దొర- అనింట్ల పీన్గెల్ల ఆడు ఏ పట్నంల సచ్చిండోగని ఆడు ఊళ్లె రోజుకో జగడం- పూటకో పంచాదు బెట్టిచ్చె. నా కెరుకున్న కాడికెల్లి గీ ఊళ్లె దొరకు దండం బెట్టంది గీ బక్కముసలి పెద్దనాయనే. ఆయినే మన అందరితోపాటు దెబ్బలు దినె, తన్నులు దినే, జేల్ల బడె. ఆపొరి మతికత్తె పెయ్యంత గొగ్గరిత్తది," కొమురమ్మ.

గుంటుక వెంబడి ఊగుతూ నడుస్తున్న బుచ్చి రెడ్డికి సరిగ్గా ఇలాంటి ఆలోచనలే వచ్చాయి. స్కైలాబ్ కూలి ఊళ్లమీద బడుతదని ఊళ్లల్లో పెద్ద దుమారం. అందరు ఎప్పుడు సత్తమోనని కోళ్లు గోసుకున్నారు. పూటగా తాగారు. తాగని పిల్లలు కొందరు హరిజన వాడకు దారి గురించి తిరుపతిరెడ్డి దొర పెరడి బండ గోడ విచ్చేసిండ్లు - దారి చేశారు. మిట్టమధ్యాహ్నం ఆ కబురు చేరి ముగ్గురు పోలీసులు వచ్చి శంకరయ్యను, తన చిన్నకొడుకు నిరంజన్‌రెడ్డిని పట్టుకున్నారు. మాటా మాటా పెరిగింది. పోలీసులు వొదులలేదు. రెచ్చి పోయిన జనం మీదబడి కొట్టారు. బట్టలు చింపేశారు. వాళ్లు వెళ్లిపోయి మునిమాపు జీబు వచ్చింది. పన్నెండు మంది పోలీసులు వచ్చారు. వాళ్లు వస్తారని తెలిసే ఆడోల్లు కారంపొడి రోకండ్లు పట్టుకున్నారు. వాళ్లందరిని నడిపింది కొమురమ్మే. అప్పుడు ఆరునెలల గర్భవతి కూడా. తుపాకులు ఎత్తకుండానే ఊరు ఊరంతా కలిసి పొల్లుపొల్లు పోలీసోల్లను గొట్టారు.

ఆ తరువాత ఊరు ఊరంతా గుడిమెట్టు బట్టింది. పోలీసులు తనను రక్తాలు కారంగ కొడుతూ ఠానాకు పట్టుకపోయారు. చెయ్యి విరిగింది. రక్తా మండలం.

బుచ్చిరెడ్డి నుదురుకు పట్టిన చెమట తుడుచు కున్నాడు. అంతా కలిసి ఇరువై సుట్లన్నా గుంటుకు కొట్టలేదు.

అంబటేల్లయ్యింది. శంకరయ్య కొమురమ్మ కని పించలేదు. అరెకరం మక్కలేసి వెళ్లిపోయినట్లున్నది. బాగా చీకటి పూటనే నాగలి కట్టినట్టున్నది.

దప్పి అయినట్టనిపించి బావి దగ్గరకు నడిచాడు. దిగుడుబావిలోకి దిగి నీళ్లుతాగి ఒడ్డెక్కేసరికి ప్రాణం చిత్తు బొత్తైంది. ఎండ లగాంచి కొడుతోంది. దక్షిణంవేపు గుడి మెట్టుమీద మబ్బులు ఆదరబాదరగా పరుగెత్తు తున్నాయి.

తన పెరడి నానుకుని ఉన్న తిరుపతిరెడ్డి ఇరువై ఎకరాల పెరట్లో తంగెళ్లు మొలిచాయి. అందులోనే గొల్ల వాళ్లు గొర్లమేపుతున్నారు. దూరంగా కనిపించే ఈదుల వాగు బందు నుండి ఎవడో గొల్లవాడు కేకవేశాడు.

అక్కడెక్కడో తీతువపిట్ట గూస్తోంది.

మళ్లీ ఎండకాలంలాగే ఎండ కాస్తోంది. పెళ్ల గించిన నేల ఎండలో నల్లగా మెరుస్తోంది.

జామచెట్టు నీడకు బుచ్చిరెడ్డి కూర్చున్నాడు.

బనీను జేబులో నుండి బాగా నలిగిపోయిన ఉత్తరం తీసి అది తన కొడుకు గుండెకాయ అన్నట్లు రెండు చేతుల్లో పట్టుకొన్నాడు.

ఆ ఉత్తరం పదిమార్లో ఇంకా ఎక్కువగానో చదువుకున్నాడు.

"మేం పట్టుబడి ఆరునెలలైంది. మూడుగజాల పొడుగు రెండు గజాల వెడల్పున్న గదిలో ఇద్దరం ఆరునెలల నుండి ఉంటున్నాం. మాకు భాష రాలేదు... ఇక్కడి నుండి విశాఖపట్నం ఏదో కేసంట తీసుక పోయారు."

ఆ తరువాత ముసలాయన కళ్లు మసకేసి పోయాయి. "నీ ఆరోగ్యం బావుందా? నువ్వు అద్దాలు కొనుక్కున్నావా?" నిజానికి ఈ వాక్యాలు అతనికి కన్పించలేదు.

తను గత యాభయేండ్ల నుండి తలవంచకుండా బతికాడు. ఊళ్లో అందరు తలవంచి తను వంచ నందుకు దొర తన కులస్తుడే పాలివాడే, అయినా కూడా దెబ్బలు కొట్టించాడు. తన అన్నదమ్ములు తన్ను ఈస డించుకున్నారు. తన స్వంత తమ్ముడే తలవంచి అమీన్ ఉద్యోగం సంపాదించాడు. చివరకు తన కొడుకులు 'బాపూ నీకెందుకే. అందరు తందానా అంటే నువ్వు తానే తందానా అంటే కాదా? ఉప్పరోల్లు, గొల్లోల్లు, కాపోల్లు, మాడుగులు, మన్నేలజోలి నీకెందుకు ఎవడే గంగల కలిస్తే నీకెందుకు?" అన్నారు.

కాని ఒక్క చిన్నకొడుకు తన తంట్లాట అర్థం చేసుకున్నాడు.

"మనిషి బతకడం అంటే ఏంది?" బుచ్చిరెడ్డికి మళ్లీ అనుమానం కలిగింది. మళ్లీ వెనుకటి ఆలోచన ల్లోకి కూరుకపోతున్నాడు. నిస్సత్తువగా అయిపో తున్నాడు.

బుచ్చిరెడ్డి లేచి నిలుచునేసరికే శంకరయ్య గుంటుకు తెచ్చి తన పెరడిలో ఆపి బావికాడికే వస్తున్నాడు.

బుచ్చిరెడ్డికి కడుపు దేవినట్లనిపించింది.

సద్దిమూటదెచ్చి బావి దగ్గరపెట్టి, "నువ్వేం ఫికరు పడక బాపూ. కాపురాయలింగన్న వస్తానన్నాడు. పెసల్లు అలుకుతం," అన్నాడు.

"వద్దు శంకరీ! సత్తవడుత నేనే అలుకుత."

"సచ్చుడెందుకు బాపూ," బుచ్చిరెడ్డిని ఆ వూరి వాళ్లంతా అట్లాగే పిలుస్తారు. బుచ్చిరెడ్డి మాట్లాడలేదు.

"ఓ బామ్మర్దీ - ఏడగుంటుకు కొట్టాలే," పెరట్లో నుండి కాపోల్ల రాయలింగం కేకేశాడు.

శంకరయ్య వెళ్లి గుంటుకు పట్టాడు.

ఆలోచనలు కట్టిపెట్టి బుచ్చిరెడ్డి గుంటుకు కాడికి నడిచాడు.

*

ఆకాశంలో చిక్కగా మబ్బులు పట్టాయి. వాతా వరణం ఉక్కగా ఉన్నది. బుచ్చిరెడ్డి అడ్లు అలికాడు. పెసల్లు అలికాడు. ఇంటి దగ్గర దళ్లు బాగుచేశాడు.

ఉదయం పదకొండు గంటలకు అతని నడిపి కొడుకు లచ్చిరెడ్డి వచ్చాడు.

"వచ్చినవ కొడుక-పాండవులకు వనవాసం కష్టా లచ్చినట్లు మనకు ఎన్ని తిప్పలు వచ్చెకొడుకా? ఇంటి కాడ కోడలు, మనమడు బాగున్నారా? కొడుకా," సుగుణమ్మ లచ్చిరెడ్డి ఒళ్లంత పునికి చూసింది.

బుచ్చిరెడ్డి మట్టి చేతులతోనే వచ్చాడు. అతనికి కొండంత ధైర్యం కల్గింది.

సుగుణమ్మ కళ్లల్లో జలజల నీళ్లు పొంగినయ్. ఆమెకు చిన్నకొడుకు జ్ఞాపకం వచ్చాడు.

లచ్చిరెడ్డి ముఖంలో మార్పులేదు. లచ్చిరెడ్డి ఒడ్డు పొడుగు మనిషి, కోలముఖం. కొద్దిగా గడ్డం పెరి గున్నది. అరుగుమీద మంచాలో తలపట్టుకొని కూర్చున్నాడు.

కొడుకు వ్యవసాయపు పనుల గురించి అడుగు తాడని తాను అన్నీచేసి పారేసినట్లుగా చెప్పాలని బుచ్చి రెడ్డి ఉబలాటపడ్డాడు... అంతకన్నా ముఖ్యంగా అతనికి కోరాపూట్ జైలు నుండి కొడుకు రాసిన ఉత్తరం జ్ఞాపక మొచ్చింది. అది తీసి చేతికిచ్చాడు.

"వాడు ఎండలబడి వచ్చిండా? లేరా కాళ్లు కడుక్కో అన్నం తిను," సుగుణమ్మ.

లచ్చిరెడ్డి ఆ ఉత్తరం చదువుకున్నాడు. లచ్చిరెడ్డి ముఖం వానమబ్బు కమ్మిన ఆకాశం తీరుగైపోయింది. మంచాల్లో నుండి లేవలేదు... తలవంచుకొని కాసేపు కూర్చుండి...

"వనమిడిసిన కోతి తీర్గయింది. పెద్దన్నకు వెయ్యి లకు వెయ్యిలు బెట్టి చదివిచ్చిండ్లు. ఏ రంధీ రవుసు లేకుంట బతుకుతండు. నా ఎనుకోడు చదువుకున్నడు. చిన్నోడు చదువుకున్నడు, ఎటుగాకుంట జేసింది నన్నే. ఈ ఊళ్లెనన్న సత్తవడుత బతుకుదామంటే వాడు సంఘమో సంఘమంట బెట్టిండు. బాపు జబ్బ లెగిరే సిండు. ఎటుపోకుంట నా బతుకే తెర్లయిపోయింది," లచ్చిరెడ్డి గొంతు అంతకంతకూ బలహీనమైపోయింది.

ఆ మాటకు బుచ్చిరెడ్డి విలవిలలాడిపోయాడు.

"నన్నెక్కడ కాకుంట జేసింది బాపే," లచ్చిరెడ్డి వెక్కి వెక్కి ఏడ్చిండు...

"అందరు బాపునే అనండ్లిరా?" సుగుణమ్మ ఏడుపు గొంతుతో- బుచ్చిరెడ్డికి ఆ మాటకాదు. అరుగు మీద సొమ్మసిలి కూర్చున్నాడు.

"నా పాలు నేను అమ్ముకుంట- మా అత్తగా రింట కాడ కుక్కబతుకైపోయింది."

ఈ మాటకు విలవిలలాడిపోయాడు బుచ్చిరెడ్డి.

లచ్చిరెడ్డి ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు.

బుచ్చిరెడ్డి, "లచ్చన్నా! అమ్ముకోరా! భూములు జాగలు ఇండ్లు అన్ని అమ్ముకో- సాలకపోతే- మీ అమ్మను నన్ను అమ్ముకో," అని లేచి పశువుల కొట్టం లోకి వచ్చి గడంచలో వెల్లకిలా పడుకున్నాడు.

లచ్చిరెడ్డి ఇంకా ఏదో అంటున్నాడు. "వాళ్లు రోజు కొకన్ని చంపుతండ్లు- ఊళ్లకు ఉగ్గం వచ్చింది. మారే అటు గానోడు ఇటు గానోడు బతుకవశంగాదు... వాళ్లు తీసుకపోయి చంపుతరు.. వాడు మారాజు తీర్గపో యిండు... వానిమీది కోపం నాయిన్నను, నన్ను తీసుక పోయి దంచిరి. ఈడ ఎట్లుండుమంటవే అమ్మ."

ఆ తరువాత ఇద్దరి ఏడుపులు వినిపించాయి.

ఉరుములు ప్రారంభమయ్యాయి. చింతలు జయ్యి జయ్యిన వంగుతున్నాయి. తాడిచెట్లు ఒకటే గలగల. గాలి మోతకు ఉరుములకు ఊళ్లె ఎవరి పిల్లో భయపడి ఏడుస్తోంది. ఎవడో వీధిలో 'గుంటుకలకు వోయినోళ్లు గుద్దుకుంటచ్చిరి. నాగండ్లకు బోయినోళ్లు నవ్వుకుంటచ్చిరి' అంటూ తపతప్ప కాళ్లు పడుతుండ గా పరుగెత్తుతున్నాడు...

తప్పడతప్పడ గవ్వలంత చినుకులతో ప్రారంభ మయ్యింది వాన.

ఈ చప్పుళ్ల మధ్య బుచ్చిరెడ్డికి ఎన్నెన్నో జ్ఞాపకం వచ్చాయి.

తన కొడుకు ఒక్కడు పార్టీలో కలిసిపోతే తన కుటుంబమేకాదు. ఊరు ఊరంత గాలికి మొదలంటా చెట్టూగినట్లు ఊగిపోయింది. తను తన జీవితకాల మంతా దొరలను ఎదిరించాడు. దానివలన తనే తన్నులు తిన్నాడు. కాని- ఊరుకేంగాలే. కాని ఇప్పుడు ఇట్లా ఎందుకౌతున్నది.

అంతెత్తు, వెడల్పు ముఖం, బొద్దుమీసాలు గల నిరంజన్‌రెడ్డి బుచ్చిరెడ్డి చిన్న కొడుకు తనపక్క నిలుచున్నట్టే అన్పించింది.

ఊళ్లో ఇరవై కుటుంబాలదాకా రెడ్డికుటుంబా లున్నాయి. అందులో నాలుగు కుటుంబాలు తిరుపతి రెడ్డివి... ఆ నాలుగు కుటుంబాలు తప్ప మిగతా పదహారు కుటుంబాలు కులంరీత్యా రెడ్లే అయినా స్థాయిరీత్యా మిగతా రైతులతోపాటే - చాలామంది ఏదో వొకరకంగా తిరుపతిరెడ్డికి తలవంచారు. శేరిదార్లుగా మారారు. ముకుందరెడ్డి తనలాగే తలవంచక, గోదావరి ఖనికి వెళ్లిపోయి బాయిపని చేసుకుంటున్నాడు. అతని బిడ్డ సుమతి. ఆమె భర్త పార్టీలో కలిసిపోయాడు.

తన తమ్ముడు ఈ గొడవలు పడలేక చదువు కున్నడు కనుక పోలీసు ఉద్యోగం దొరికి వెళ్లిపోయాడు. వాడు అమీనయ్యిండు. వాడికి పిల్లలు లేకుంటే నిరంజన్‌రెడ్డిని సాదుకం ఇచ్చారు.

అక్కడ వాడు రాజభోగాలే అనుభవించాడు. కాని అక్కడికన్నా వాని ధ్యాసంతా ఊరి మీదనే- ఉప్పరి వాళ్ల పిల్లలతో ఆడటం.

బుచ్చిరెడ్డికి మూడేండ్ల క్రితం డిపార్టుమెంటు బాధపడలేక రాజీనామా చేసిన తమ్ముడు జ్ఞాపకం వచ్చాడు. వాడి మూలకంగా ఆ భార్యాభర్తలిద్దరు ఎప్పుడు తగువులే-

'నిజంగానే నిరంజన్ వీళ్లందరి కుటుంబాల్లో చిచ్చు రేపాడా?'

వర్షం పెద్దదయ్యింది. వాకిట్లో నీళ్లు పారు తున్నాయి.

పెరడి దగ్గర కరంటు మోటార్ షెడ్లో మీటింగు బెట్టారు. తనకు తెలియని వాళ్లు నలుగురు వచ్చారు. అందులో బుచ్చిరెడ్డి వయసున్న ముసలాయన- ఈ ముసలాయన కేంబొయ్యే కాలమో అర్థంకాలేదు.

తనను కావలుంచారు. వాళ్లు మాట్లాడుకుంటూ ఉండగా నిరంజన్ తన దగ్గర కూర్చున్నాడు. తన ధ్యాసంతా ఆ నలుగురి మీదే - తనను అటు నుండి మళ్లించడానికి.

"బాపూ వో పారి ఏమయ్యిందో ఎరికేనా?"

"నాకెట్ల తెలుస్తుందిరా? నాది గొడ్డటి పురాండం. నా కెరుకున్నదల్లా మాటంటె పడకపోవడం."

"ఎవలంటె?"

"మనూల్లె రైతులు నన్ను ఎందుకంటారు?"

"మరి ఎవలంటారు?"

"వాడే దొర. అందరితీర్గ నేను కోతిదండాలు బెట్టాలె. వాడు రెడ్డి పుటుకే బుట్టిండు నేను గదే కులం.

నేను కట్టంజేసుక బతుకుతున్న. వానికి మాదుగులు మన్నేల తీర్గబాంచెనంట ఎందుకు బతుకాలె.''

''బాపూ మాదుగులు మన్నేలు బాంచెనెందు కంటరే?''

ఈ ప్రశ్నకు బుచ్చిరెడ్డి తికమకపడ్డాడు.

''అదట్లా పోనియ్యి. తిరుపతిరెడ్డికి నువు దండం బెట్టలేదనే కోపమా? మరి మాదుగులు మన్నేలు దండం బెడుతరుగదా? వాళ్లవాడకు దారెందు కియ్యలేదు... ఉప్పరోల్లకు ఇటుక జేసుకుంటె బట్టికింతని ఎందుకు గుంజుకున్నడు. ఎందరి భూములు గుంజుకున్నడు...''

''నువ్వు దండం బెట్టనందుకే నిన్ను కొట్టించిం డనుకున్నవ్. కని మన గీబాయికాడి పెరడి పదెకరా లంటివి. ఇప్పుడు నాలుగెకరాలు లేదు. నువ్వు కేసు లకు దిర్గి అమ్మినవ్- దొరకుగాదు. అయ్యోరి పంతులుకు. అయ్యోరు పంతులు మరునాడే తిరుపతి రెడ్డి కిచ్చిండు. బాపూ నువ్వే కులమన్నదిగాదు. నువ్వొ క్కనివే ఎదురు నిలిచినవన్నదిగాదు. నువ్వు తలవంచ లేదు. నిజమేకని,'' ఎందుకో నలుగురు పిలిస్తే వెళ్లి గంట తరువాత వచ్చిండు.

''ఓసారి ఏం జర్గిందంటే... మనూల్లె కొట్లాట బడ్డంక నేను ఎల్లిపోయిన్నా. నేను పెద్దపెల్లి అవల తిరిగిన ఏ వూరని అడుగకు. నేను గౌండ్లోల్లింటి కాడ ఉండుడు. ఆయినె బావమరిదని చెప్పిండు. తాళ్లయితే ఎక్కరాదు... కని కల్లు కుండలు మొయ్యబెట్టిండ్లు ద్దుత్తెరి గిదేం పార్టీపని అనుకొని కోపంగుండె- ఓనాడు కాగంతకుండ సుట్టబట్ట బెట్టుకొని నెత్తిమీద బెట్టుకున్న. అయితే చెప్పలేదుగద- మనూరితీర్గనే లొల్లిబడి పోలీసు క్యాంపు బెట్టిండ్లు. ఆ వూల్లె మల్ల అందరిని కుప్ప జెయ్యాలె... మునుపటి తీర్గపోతే కలువది. కుండ నెత్తి మీద బెట్టుకొని నడుస్తున్న. మెడ నరాలు జువ్వజువ్వ లాడుతున్నయ్. తాటితోపుకు ఊరికి మద్దెన మన ఆగు తీర్గనే ఈదుల వాగున్నది. అక్కడికచ్చేటాల్లకు నాకు ఎక్కడలేని కోపమొచ్చింది. రెడ్డి పుటుక పుట్టుడేంది? కల్లుకుండలు మోసుడేంది? కల్లుకుండ ఎత్తేసిన- పార్టీ వద్దు మన్నద్దు అనుకున్న- ఎందుకో బాగా ఏడుపు వచ్చింది. ఎటుగాకుంటయిన్నానని, చినబాపు తిట్లు జ్ఞాపకం వచ్చినయి. వాగొడ్డుకు కూర్చున్న, కంజీకట య్యింది. అంతలోనే నేను ఎంతకు రాకపోయేసరికి ఆ గౌండ్లాయన ఆదుర్దాపడి ఏం జరిగిందోనని, పోలీసులు గిన పసిగట్టిండ్లేమోనని ఎగపోసుకుంట ఉరికచ్చిండు. నన్ను చూడంగనే నా మీదపడి పెయ్యంత పునికిండు. కన్నీళ్లతో నా కడుపుల తలబెట్టిండు. రుమాలుతో ఒళ్లు తుడిచిండు. బాపు నాకు చిన్నప్పుడు నీ పక్కలో పడుకున్నట్లు - బాపూ చిన్న బాపు బాగా తిట్టి ఏడిస్తే సైకిలు కొనిచ్చి నేను నిదరపోయినప్పుడు నన్ను పునికి నట్టు...''

''బాపూ నేను పోతున్ననే.''

బుచ్చిరెడ్డి ఉలిక్కిపడ్డాడు. వానవెల్సింది. కొద్దిగా తుప్పరపడుతోంది.

లేచి నిలుచున్నాడు. ఏమాట తోచలేదు.

''మన కట్టాలు కడతేరి తమ్ముడింటికత్తె వెంక టేశ్వరస్వామికి అందరిని తీసుకత్తనని మొక్కిన కొడుకా! జేగర్తగపో.''

''నా మనసు మంచిగ లేక ఏదో అన్న బాపు. తమ్ముని దగ్గరికి మన సత్తెన్నను తీసుకుపో. అన్న దగ్గర అయిదువందలడిగి పంపిత్త. పదిదినాల నుంచి అందరం అత్తామనుకుంటన్నం. ఇంతట్ల వాన్నెవన్నో సంపిరి. ఊళ్లల్ల ఉసికి ఉడుకుతోంది. మల్ల పదిరోజుల కత్త.''

బుచ్చిరెడ్డి కలలో నడిచినట్లుగా కొడుకువెంట వాకిలిదాకా నడిచాడు.

వాళ్లు వీధిమలుపు తిరిగి మూడు పానాదుల దాకా వచ్చారు.

సుగుణమ్మ ఏదో చెప్పుతూనే ఉన్నది. బుచ్చిరెడ్డి నీళ్ల కాలువల్లో అడ్డకట్టలేసి ఆడుతున్న పిల్లలను చూస్తు న్నాడు... అతని కళ్లల్లో ఊరిన నీళ్లు - జ్ఞాపకాలు మరిచి పోదామని.

సుగుణమ్మ ఆగిపోయింది. బుచ్చిరెడ్డి, లచ్చిరెడ్డి వెంట చాలాదూరం వచ్చాడు.

ఆంజనేయుని గుడిదగ్గర లచ్చిరెడ్డి ఆగి తండ్రిని, ''ఇగపోయే బాపూ,'' అన్నాడు.

బుచ్చిరెడ్డి కొడుకు దగ్గరిదాకా వచ్చి ''మిమ్ము లందరిని పిల్లజెల్లాతోని బతుకాలనే పెంచిన కని... నాకు తెలువకుంటనే గిట్లయ్యింది. చిన్నోడు మిమ్మల నెప్పుడు ఆ మాటకత్తె ఈ భూలోకంల ఎవలను అసి నిత్తని మాటనలే. వాని దారి మంచిదో సెడ్డదో నా కెరకలే. వాని మీద కోపం బెట్టుకోకు.'' ఇంకా చాలా చెప్పాలనుకున్నాడు. చిన్న కొడుకు హృదయం తనకు మాత్రమే తెలిసిన హృదయాన్ని విప్పాలనుకున్నాడు. తన మొత్తం బతుకులో ఇలా నెమ్మదిగా మాట్లాడి ఎరుగడు. ఈ తీరు తనదికాదు.

"నాకు వాడు తమ్ముడు కాదే. ఏంజెయ్యాలె బాపు నా మనుసంతా ఎలుగడి బడ్డట్టుగున్నది," లచ్చి రెడ్డి చరాచరా వెళ్లిపోయాడు.

బుచ్చిరెడ్డి హనుమాండ్ల గద్దెమీద కూర్చున్నాడు. గాలికి బొడ్డుమల్లె చెట్టు మీది నుండి వాన చినుకులు టపటప రాలుతున్నాయి.

తడిసిపోయి గుడ్డలు అతుక్కుపోయి- పనులు సాగక గుంటుకలు, నాగండ్లు బజాట్లో గీరుతుండగా చెక్కుకపోయిన చెంపలవాళ్లు, ముఖాలమీద నెత్తురు లేనివాళ్లు వస్తున్నారు.

చంకల్లో పిల్లలేసుకొని ఇంటిదగ్గర కావలున్న కొంచెం పెద్దపిల్లలు వీధుల్లోకే వచ్చి తల్లులకిస్తున్నారు. అరుపులు, పిలుపులు- ఎడ్ల కాలిగిట్టల చప్పుడు, వర్షానికి తడిసి రెక్కలార్చుకుంటూ ఎగిరే పక్షులు... ఈ మొత్తం శబ్ద ప్రపంచం తనది కానట్లు ఇందులో తను లేనట్టు రాతిస్థంభానికి జేరగిలబడి కూర్చున్నాడు...

తన చిన్నకొడుకు మల్ల ఊళ్లెకువస్తాడా? వచ్చి పెండ్లి చేసుకొని అందరిలాగే బతుకుతాడా? పెళ్లి చేసు కున్నాడంటారు? ఇందాక బాయికాడి మీటింగులో తెగి పోయిన ఆలోచన గుర్తొచ్చింది. వాడు తన అనుభవం ద్వారా తన లోపమేమిటో ఎత్తిచూపాడు. తన కుటుంబం మొత్తం ఆఖరుకు భార్య, తమ్ముడు, పెద్ద కొడుకు, చిన్న కొడుకు అందరు తను తిరుపతిరెడ్డికి లొంగిపోతే తమ బతుకు ఇట్లా ఉండకపోవునన్నారు. తిరుపతిరెడ్డి ఊరు విడిచి వెళ్లిపోయిండు. ఇప్పుడు తమ్ముడు చెయ్యిబట్టే తమ బతుకు అల్లకల్లోలం అయ్యిందంటున్నారు. కాని వాడు ఏమన్నాడు. ఆ అల్ల కల్లోలం మనుషుల్లో కాక మనుషుల బతుకుతెరువులో ఉందన్నాడు. తిరుపతిరెడ్డికి లొంగినా లొంగకపోయినా రైతు బతుకు ఇంతే- కూలీల బతుకులు అంతే. కొట్లాట వీళ్లకు లేనిది వాడికున్న దాంట్లో ఉన్నది. కులం ఒక్కటే అనికాదు.

అతనికి చివరిసారిగా మహారాష్ట్రలో కొడుకుని కలిసింది జ్ఞాపకం వచ్చింది.

అప్పుడు ఇట్లాగే జైలు నుండే ఉత్తరం రాసిండు. అటడిగి ఇటడిగి పోయేసరికి రెన్నెల్లు పట్టింది... తనకు బేల్ ప్రయత్నం చేయమన్నాడు. తనవెంట పెద్ద కొడుకు వచ్చాడు.

ఆరునెలల తిరుగగా తిరుగగా బేల్ దొరికింది. జైలు నుండి విడుదలయ్యేసరికి సాయంత్రం అయి దయ్యింది. రైలుస్టేషన్‌కు పోదామన్నాడు తను. రాత్రికి బండున్నది అంతదాకా స్టేషన్లో కూర్చుండాలెనని తనను ఒక మరాఠీ పంతులింటికి తీసుక వెళ్లాడు. అక్కడ పిల్లలు, ఆ ఇంటామె ఒకటే హడావిడి పడ్డారు. వాళ్ల స్వంత తమ్ముడే వచ్చినట్లుగా. వాళ్లతో నవ్వుతూ ఆడు కున్నాడు. తనకు ఆ భాష రాక చూస్తూ కూర్చున్నాడు.

కాసేపటికి నేలమీద గోడనానుకొని కూర్చుండి-

"బాపూ," అన్నాడు, ఆ పిలుపు కొత్తగా వింతగా ఉన్నది.

"బండెప్పుడురా నిరంజన్," అప్పటికి రాత్రయి పోయింది.

వాళ్లు తిండికి పిలిచారు. ఆ పంతులు ఎటో పోయి వచ్చాడు.

తిండి తిన్న తరువాత డాబామీదికి తీసుకవెళ్లి తెల్లగా పిండరబోసినట్లుగా కాసే వెన్నెట్లో, "బాపూ," అని ఇందాకటి పిలుపే పిలిచాడు. అప్పుడర్థం కాలేదు గాని. ఇప్పుడు వాడేదో చెప్పదలుచుకున్నాడు. ఆ గొంతునుబట్టి వాడేమి చెప్పగలడో అర్థమయ్యింది.

"నిరంజన్- చిన్నబాపు ఉద్యోగం రాజీనామా ఇచ్చిండు. మీ చిన్నమ్మ ఏడ్చేడ్చి దవాఖాన పాలైంది. మీ అమ్మ... నీ కాలుకు ఆపరేషనయ్యిందంటివి. మనిషిని సగమైపోయినవ్... నువ్వు అడవుల పొన్నతిర్గ లేవు. అదిగాక నీకన్న పెద్ద లీడరు జయరామ్‌రెడ్డి," తను చెప్పవల్సిన విషయాలు ఎక్కడ మర్చిపోతాడేమో నన్నంత గాభరాగా చెప్పుకొచ్చాడు.

తలవంచుకొని అన్ని విన్నాడు. వాడు ఏదన్న మాట్లాడుతే ఎన్ని వాదాలు చెప్పాలో తను సిద్ధం చేసుకొనే ఉన్నాడు.

"బాపూ నువ్వు యాభయేండ్లు తిప్పలుపడ్డది- రెడ్డివై పుట్టి పౌరుషం కోసం కాదు... లొంగిపోకకాదు... అంతకన్నా ఏ రైతుకు తిప్పలు లేకుంట బతుకవశం గాదుగన్క."

'ఇది ప్రశ్నా? ఇది జవాబా?' తను నిరుత్తరు డయ్యాడు.

"బాపూ తను పుట్టి పెరిగిన వాతావరణంలో నుంచి తనకు ఇష్టమున్నా కష్టమున్నా మనిషికి ఒక్కొక్క బతుకు ఖరారైపోతుంది. నేను ఉద్రేకంతోనో, ఆవేశం తోనో ఈ మార్గం ఎంచుకున్నది కాదు. పోనీ నీ మాట మీద వస్తాననుకో ఏమౌతుంది? ఆంధ్రా పోలీసులు నన్ను చంపడం ఖాయం లేదా మళ్లీ జైలు... నారాయణ రెడ్డి నీకు ఎరికేననుకుంట ఇప్పుడేం జేస్తండు... బాధ కాగలేక రహస్యాలు చెప్పిండు. దొల్లిపోయిండు.

ఇప్పుడు పోలీసోల్ల పెట్టుకొని బతుకుతండు.''

''అదిగాదురా? మొన్న జయరామ్‌రెడ్డి కల్సిండు.. భూములు, పంచాదులు, మనుషులు ఊళ్లల్ల ఉంటే మీరు గీ అడివిల.''

''ఇంకేమన్నడు.''

''జగితాల తీరుగ మల్ల రైతుకూలీ సంగాలు బెట్టాల్నట.''

''పెట్టి?''

''కొట్లాడాల్నట.''

''సరే ఎవలద్దన్నరు?''

మల్లీ తనకు మాటలు దోయలేదు.

''బాపూ అదంత పెద్దకథ - ముంగటికి పోయినా కొద్దీ పద్ధతి మారుతూ ఉంటది. కాదు ఎనకటి తీర్గనే ఉండాలంటారు కొందరు. వాడు ఎనెకటితీర్గ లేనప్పుడు మనం ఎట్లా ఉంటం... వాడు సిఆర్‌పి తెచ్చినంక-దొరలు ఊళ్లిడిచిపోయి పోలీసులే ఊళ్లేలినంక-మునపటి తీర్గ సంగాలుండయి.''

వాడు రాడని అర్థమైపోయింది.

కాని ఆశ చావదు. ఈ ఆరునెలలు తిర్గడానికి అర్థమేమిటి?

''నాయనా నిరంజన్...'' తన గొంతు పూడుకపోయింది.

అంతలోనే డాబామీదికి ఎవరో వస్తున్న చప్పుడు. మరాఠీ పంతులు వచ్చాడు.

ఆ పంతులు, నిరంజన్‌రెడ్డి ఏదో మరాఠీలో మాట్లాడుకున్నారు. మరాఠీ పంతులు వెళ్లిపోయాడు.

''బాపూ రైలుకు మన ఆంధ్రా పోలీసులు వచ్చిండ్లట. రైలు ఆలస్యం అయ్యిందట. నాకు బేల్ ఇప్పించిన వకీలు ఇంటికి పోయిండ్లట. ఆ వకీలును తీసుకపోయి ఠానాలో వేసిండ్లట.'' మల్లీ ఏమనుకున్నాడో ఏమో... కాసేపాగి-

''పెద్దన్నకు చెప్పు- నాకోసం పైసలు ఖర్చు బెట్టిండు. అమ్మకు చెప్పు ఎప్పుడో వచ్చి కలుస్త. తప్పకుండవచ్చి కలుస్త,'' మాట్లాడేది అయిపోయింది. వాడెటో ఇప్పుడే పోవడానికి తయారుగున్నట్టు తోచింది.

ఇద్దరు డాబా దిగి వచ్చారు. ముందుగదిలో ఇంకా మీసంరాని పిల్లవాడు బెదురు చూపులు చూస్తూ కూర్చున్నాడు.

''బాపూ. వాడు నా వెంటరాలేదని చెప్పు. నడిపన్నను వారం పదిదినాలు ఎటన్న పొమ్మని చెప్పు. ఆయింక మర్చిపోతరు.'' తయారైపోబోతూ, ''చిన్నాయన, చిన్నమ్మకు నేను చెప్పేదేమున్నది. నేను మీకన్న వాళ్లను బాగా కష్టపెట్టానని అనుకుంటరు...'' వెన్నెల వెలుగులో వాళ్లిద్దరు వెళ్లిపోయారు.

బుచ్చిరెడ్డి ఎందుకో పొడుగ్గా గాలిపీల్చి లేచి నిలుచున్నాడు. కాళ్లు పట్టేసినయ్. హనుమాండ్ల గద్దెదిగి బజాట్లోకొచ్చి నిలుచున్నాడు. పడమటిదిక్కు మబ్బుమాయలేని సూర్యుడు. గుడిసెల మీద సాయంత్రపు ఎండ మెరుస్తోంది. బజార్లో నీళ్లు ఇంకిపోయి పిల్లలు వేసిన కట్టలు అట్లాగే ఉన్నాయి.

బుచ్చిరెడ్డి మొదట ఇంటికి పోవాలనుకున్నాడు. మనస్కరించలేదు. ఈ జ్ఞాపకాలు సంతోషం, దుఃఖం కాని అదేదో స్థితిని కలిగిస్తున్నాయి. బుచ్చిరెడ్డి ఈ జ్ఞాపకాలలోనే బతుకుతున్నాడు.

బుచ్చిరెడ్డి పెరడికేసి దారితీశాడు. మల్లీ కలగాపులగమైన జ్ఞాపకాలు... అత్తిరి బిత్తిరి మాటలు.

వాటిని దూరంగొట్టే ప్రయత్నంలో వడివడిగా నడుస్తున్నాడు...

*

ఆకాశం మబ్బు మాయ లేకుండా తేటతెల్లమైంది.

బుచ్చిరెడ్డి వాగొడ్డుకు ఎడ్ల మేపుతున్నాడు. ఎటు చూస్తే అటు పచ్చగా పునాస పంట పెసరు మొలుకలు కన్పిస్తున్నాయి. దూరంగా కనిపించే గుట్టబోరు ఒక పచ్చని శిఖరంగా కనిపిస్తోంది.

ఆవలొడ్డుకు గొల్లకొమురయ్య గొర్ల మేపుతున్నాడు. పూరేడుపిట్ట కుర్రుమంటున్నట్టుగా, 'ఆ పల్లెన గలవన్ని కంపదడులే,' అంటూ పాడుతున్నాడు.

''ఒహోయి గొల్లబోయిడా! నీ అండ్ల నువ్వే పాడుకుంటన్నవ్,'' బుచ్చిరెడ్డి కేకేసిండు.

బుచ్చిరెడ్డికి ఏదన్నా పాడాలని ఉన్నది. 'ముసలితనానికి దసిలిరైక తీర్గ గిప్పుడు పాటలేంది,' అనుకున్నాడు.

''ఎవలది- బుచ్చయ్య పటేలేనా?'' గొల్ల కొమురయ్య ఓటుగాలు ఎగేస్తూ ఈదుల్ల నుంచి బుచ్చిరెడ్డి దగ్గరికొచ్చిండు.

గొల్ల కొమరయ్య వయసు అరవై దాటినయ్. అయినా నల్లగా పొట్టిగా కాలిన తునికి మొట్టులాగుంటాడు. పెయ్యికి కొమురయ్య ఎన్నడూ అంగి తొడుగలేదు. ఎండా, వాన, చలిలో ఆ పెయ్య కాయ గాసిపోయింది. అతనికి ఈ భూప్రపంచంలో నా అన్న వాళ్లెవ్వరులేరు. అతను ఏ వూరివాడో ఎవరికి తెలియదు.

తెలంగాణా సాయుధ పోరాటకాలంలో ఎక్కడో అతనికి తూటా తగిలిందంటారు. పోరాట విరమణ తరువాత ఈ వూరికి వచ్చి అప్పుడు ఊరిబయట- ఇప్పుడు ఉప్పరి వాడ వెలిసిన చోట గుడిసెలో ఉన్నాడు.

'ఇన్ని సంవత్సరాలు ఓ బండతీర్గ ఎట్లు బతి కిండబ్బా,' బుచ్చిరెడ్డి కొత్తగా చూసినట్లుగా...

అదేదో కొమురయ్యకు తెలిసిపోయినట్టే ఉన్నది.

"మీ చిన్నోడు ఉత్తురం రాసిండటగదా!" మాట మారుస్తూ.

"ఆ పదిహేనొద్దులాయే రాసి- ఆడు రాసిన దేశం యాడుంటదో ఎరికలే. సేతుల పైసల లేకపాయె. గీ వయసుల అంతదూరం ఒక్కన్ని ఎట్ల బోవాలెనని తండ్లాడుతున్న."

"పోతులకు పోతులు ఇంక ముగ్గురు కొడుకు లున్నరు గదా!"

"మావున్నరుగని- వాళ్లకు గుండె సిన్నది. పిరికి పిత్తులోల్లు. మొన్న మా నడిపోడచ్చి కష్టసుఖాలడు గల్నా? నన్ను సదివియ్యలేదని ఎగిరిండు."

"సదువుకున్నోల్లకు నెనరుండదిలే- అందరి కష్ట సుఖాలు ఇసారం జేసేటోన్ని బతుకనియ్యరు."

"మా తమ్ముడు మా సిన్నోన్ని పదిపన్నెండేడ్లు సాది సదువు సెప్పిచ్చిండా? పోలీసోల్ల బుద్దె గంతే నేమొ?"

"ఎంత ఆశతోని ఉత్తరం రాసిండో," కొమురయ్య

"నిన్న షావుకారికి పదిగిద్దెల అడ్లు ఒప్పివచ్చిన. వానికన్న ఎక్కువనా? బట్టలు దీసుకున్న పదిహే నొద్దులు ఎవడు సప్పుడు చేయంది. కరినగురం నుంచి మా మరదలు ఓ జత బట్టలు, కజ్జెలు, అయిదునూర్ల రూపాయిలు పంపింది. మా సత్తయ్య తను వస్తనన్నడు. రేపు మాపటి బండికి పోతం."

బుచ్చిరెడ్డి చెప్పుకొచ్చాడు.

బుచ్చిరెడ్డికి ఈ రోజంతా చెప్పరాని సంతోషంగా ఉన్నది. దాదాపు తనకు కనిపించిన వానికల్లా గుసగుస గా తను పోయే సంగతి చెప్పుకొచ్చాడు. శంకరయ్య ఇంటికి రెండుమార్లు వెళ్లినా శంకరయ్య కన్పించలేదు. నిన్న పొద్గాల లేసి సడ్డకునింటికి పోతనని పోయిండట.

వాళ్లిద్దరట్లా మాట్లాడుకుంటుండగానే పొద్దు గూకింది.

బుచ్చిరెడ్డి ఎడ్ల కొట్టుకుని బయలుదేరాడు. పశు వుల మందలు ఊళ్లెకు మర్లుతున్నాయి. పనులమీద వెళ్లినవాళ్లు ఈడ్చుకపోయిన ముఖాలతో ఇండ్లకు మరలుతున్నారు.

చెట్లమీద పక్షుల కవ్వర కవ్వర అరుస్తున్నాయి...

గుడిసెలమీద పొగలు సుళ్లు తిరుగుతున్నాయి.

బుచ్చిరెడ్డి కనిపించిన వారినల్లా మందలించాడు. యోగక్షేమాలడిగాడు. వాళ్ల సెలుకల్లో ఏమేమి అలికారో అడిగి తెలుసుకున్నాడు.

శంకరయ్య ఇంటి ముందు నిలుచున్నాడు. శంకరయ్య భార్య కొమురమ్మ రోట్లో తొక్కు నూరు తోంది. ఆమె కూతురు ఏడిచే పిల్లవాన్ని రొండికేసుకొని ఆ బరువుకు బాణం బద్దలాగా వంగిపోయి నిలు చున్నది. పిల్లవాడు తల్లికేసి సాగులు సాగుతూ ఏడు స్తున్నాడు.

"కొమురు. ముందుగాల పిలగానికి పాలియ్య రాదే," అన్నాడు బుచ్చిరెడ్డి.

"మా యిచ్చిన బాపూ... పొల్లగండ్లకు ఆకలై తంది. పొద్దుందాకా పోయచ్చిన..."

"శంకరి రాలేదా?"

"అయినకేంది మారాజు ఎటుబోతటే-"

"వచ్చినంక జెరంత ఇంటిదాక రమ్మంటవ."

"మా చెప్పుత బాపూ."

బుచ్చిరెడ్డి బజాట్లోకి వచ్చాడు. అప్పటికే ఎడ్లు మూలమలుపు తిరిగాయి.

"అద్దులే- ఏడేడ తిరిగత్తడో- నేనే వత్త," బుచ్చి రెడ్డి కేకేసి చెప్పి బజాట్లోకి నడిచాడు.

*

సుగుణమ్మ హడావిడి పడిపోతోంది. రెండు చేతి సంచుల్లో ఒకదాంట్లో బట్టలు, ఒకదాంట్లో పిండి వంటలు సదిరారు.

"ఇగో వాడు అందరికి పెద్దడు. ఓ మాట చెప్పు!" సుగుణమ్మ పళ్లెంలో సకినాలు తీసుకొచ్చింది.

"నా కెందుకే- వాడికే పెట్టు," బుచ్చిరెడ్డి.

"వద్దు మా అమ్మ కొంచెపుది అనుకుంటడు," మళ్లీ తనే.

పళ్లెంలోని సకినం ఒకటి తీసుకొని కొరకలేక, "నా పండ్లు ఇప్పుడే ఇరుగ్గొట్టేటట్టున్నవ్. అన్నం తీసుకరా?" మళ్లీ ఒకమారు లేచి సంచులు సదిరి చూసి గుమ్మికి తగిలించాడు.

అన్నం తెచ్చేసరికి బుచ్చిరెడ్డి వాకిట్లోకి శంకరయ్య కోసం చూచి వచ్చిండు.

"ఇగో పాపం యేరాలు శాంత కంటికోధార నేలకో ధార. మీ అన్నదమ్ములు ఎంతైన బండలు. పెంచిన ప్రేమగదా!"

"అడికి నువ్వు ఏడ్వనట్టు."

"గిట్లనే చెప్పుతవా?"

"ఆ మీ అమ్మ ఏడ్చేడ్చి నేల బట్టిందంట."

"అను. వానికెర్కలేదా?"

కంచంలో కెలికాడుగాని తిండే సయించలేదు. సుగుణమ్మ వొత్తిడి చెయ్యలేదు. ఆమె గత పదిహేను రోజులుగా సరిగా తినడంలేదు.

బుచ్చిరెడ్డి చెయ్యి కడుక్కొని వాకిట్లోకొచ్చి నిలుచున్నాడు. గడపలో కొచ్చి సుగుణమ్మ "ఎవల కోసం చూస్తన్నవ్."

"ఎవలత్తరే మనింటికి - శంకరిని రమ్మన్న గొడ్డు గోదా జెర పెరడికెళ్లి సూడుమన్న."

ఇంట్లోకి వచ్చి చెప్పులేసుకున్నాడు.

"మల్ల రేపు పయినం. రాత్రయ్యే దనుక వుండకు," సుగుణమ్మ-

బుచ్చిరెడ్డి వీధి మలుపు తిరిగేసరికే శంకరయ్య ఎదురొచ్చిండు. వీధి లైటు కింద ఇద్దరు ఎదురుపడ్డారు.

"బాపూ మీ యింటికే వస్తున్న," శంకరయ్య.

శంకరయ్య ముఖం వాడిపోయి ఉన్నది.

"ఎప్పుడొస్తివి," బుచ్చిరెడ్డి.

"ఇగో గిదే రాకడ- ఇంటికి పోయేటాల్లకు నువ్వు రమ్మన్నవని చెప్పింది."

"పా- మీ ఇంటికే పోదాం పా," బుచ్చిరెడ్డి.

శంకరయ్య కాసేపు తటాపటాయించిండు.

"నేను గిప్పుడే తిన్న. నువ్వు తినకుంట మాట్లా డేవు."

శంకరయ్య బుచ్చిరెడ్డి ననుసరించాడు.

అప్పటికి ఊళ్లో చాలామంది పడుకున్నారు. పగలంతా అలసిపోయిన వాళ్లు తొందరగానే పడుకుంటారు.

ఇద్దరు మవునంగా నడుస్తున్నారు. చింత చెట్లల్లో గాలి నొక్కిపట్టిన ఏడుపులాగా ఉన్నది. పయిడికంటె పలుకుతోంది.

వాళ్లిద్దరు హరిజన వాడకు వెళ్లేదారి దగ్గరి కొచ్చారు.

"ఈ దారి మన నిరంజనన్న ఉండంగ తీసిందే గదా!" శంకరయ్య.

"నాకు మతికి లేదనుకున్నవ- నాకు అన్ని మతి కున్నయి. వాడు ఈ బండ గోడమీద నిలబడి మాట్లాడింది. నేను ఆనాడు ఏ లొల్లి జర్గుతదోనని ఉరికచ్చిన. వాడు మాట్లాడిన ప్రతిమాట నాకు మతికున్నది. ఆయింక జరిగిన కొట్లాట."

శంకరయ్య ఆ మసక వెలుతురులో తెల్లని గడ్డంలో గల బుచ్చిరెడ్డి ముఖం చూశాడు..

అక్కడి నుండి ఇద్దరు కలిసి అనుమాండ్ల గుడి దగ్గరికి వచ్చారు.

"బాపూ కాసేపు ఇక్కడ కూసుందామా," అన్నాడు శంకరయ్య.

"నీకాకలైత లేదా?" బుచ్చిరెడ్డి.

"ఎప్పుడు పుర్సతులేదు. ఆరేండ్లాయె కడుపు నిండ మాట్లాడుకోక."

బుచ్చిరెడ్డికి 'కడుపునిండ' అన్నమాట నాభిలో తాకింది. అత్తిరి బిత్తిరి అయిపోతూ గద్దెమీద కూర్చున్నాడు. అతనికి కిందిమెట్టు మీద శంకరయ్య కూర్చున్నాడు.

ఊరులుకు మగ్గిపోయింది... గుడి లోపల చీకటి చీకటిగా ఉన్నది.

బుచ్చిరెడ్డి తన ప్రయాణం సంగతి చెప్పకొచ్చాడు.

శంకరయ్య మాటలు రానివానిలాగా తత్తరపడుతున్నాడు.

"నిరంజన్ మన ఊళ్లెనుంచి ఎల్లిపోయిన్నాటి నుంచే ప్రజలమనిషై పోయిండు. పెద్దపెల్లి సుట్టు పక్కల ఉన్నప్పుడు ఆనోట ఈనోట మనకు సంగతులు తెలిసేయి," శంకరయ్య.

"వాడు ఈన్నుంచి పోకపోవు. రైలుస్టేషన్ల బాంబు బేలి చెయ్యికాలి పోయినప్పుడు మా ఇంటికచ్చిండు. మా ఇంటికాడ గదే తినుడు కొడుకు," బుచ్చిరెడ్డి.

"ఇగ అప్పటినుంచి మరాఠి దేశంలకు బోయిండు. మన భాషగాదు. వాళ్లు మన మనుషులు గాదు. జంగల్ పట్టోల్లు- వాళ్లండ్ల రెండేండ్లు పని జేసిండు. తుపాకి బట్టిండు. దళంల దిర్గిండు. కాలుకు ఆపరేషనైనంక మల్లో పని- గపనిల ఆయినె ఉన్న ఇల్లు పోలీసోల్లకు దెల్సిపోయింది. దాన్ని చుట్టుముట్టేటాల్లకు అందరిని సెలుపుకొని ఉరికి లారెక్కబోయిండు. కాలు మంచిగలేక దొరికిపోయిండు," శంకరయ్య వరుస క్రమంలో చెప్పుకొస్తున్నాడు. అక్కడి నుండి కోరాపుట్ జిల్లా- అక్కడి పోరాటాలు.

బుచ్చిరెడ్డికి సగం తెలుసు. అయినా ఇవ్వన్ని ఇప్పుడు ఎందుకు చెప్తుతున్నట్లో అర్థంకాలేదు.

"శంకరీ తెల్లారి మాట్లాడుకుందాం. నువ్వెప్పు డనంగ తిన్నవో- కొమురమ్మ నీ కోసం ఎదురుసూత్తది."

"బాపూ నీకు నిరంజన్ అందరితీర్గ బతుకుతే బాగుండుననిలేదా?" శంకరయ్య కంఠంలో ఏదో గుర గుర లాడుతోంది.

బుచ్చిరెడ్డికి నోట మాట రాలేదు. అయినా తమా యించుకోని, "నేను గీ ఊళ్లె బుట్టి గీ ఊళ్లెనే బతుకు గడిపినోన్ని. వాడో... దేశదేశాలు తిరిగినోడు," బుచ్చిరెడ్డి.

"అయినా ఇంకా నీకొడుకే ననుకుంటన్నవ్ గదా!" శంకరయ్య.

"ఢిల్లికి రాజైన తండ్రికి కొడుకే గదా!"

"బాపూ మన నిరంజన్ గిప్పుడు కోట్లమందికి కొడుకైండు," శంకరయ్య గొంతు వనికింది.

"ఏందిరా శంకరీ!" బుచ్చిరెడ్డికి ఆ మాట అర్థం కాలేదు. కాని ఆ గొంతు అర్థమౌతోంది.

"బాపూ నాకు చెప్పస్తలేదు. నేను నిరంజన్ తండ్రిని కాదు. కేసుకు తీసుకపోంగ నిరంజన్‌ను పోలీసులు కాల్చేసిండ్లట," శంకరయ్య బుచ్చిరెడ్డి వనికే చేతులు పట్టుకున్నాడు.

"అవద్దం. నువ్వు అవద్దం చెప్పతన్నవ్- నా కొడుకు నా నిరంజన్ రాసిన ఉత్తరం..." మాటకు మాట పొంతన లేకుండా బుచ్చిరెడ్డి వదురుతున్నాడు.

శంకరయ్య బుచ్చిరెడ్డిని పొదివి పట్టుకున్నాడు. పిచ్చిపిచ్చిగా మాట్లాడి ఒక్కసారే నోరు పడిపోయిన వానిలాగా అయిపోయాడు.

శంకరయ్య తనకానించుకొని ఇంటికి తీసు కొచ్చాడు.

సుగుణమ్మ తలుపుతీసి వాళ్లిద్దరిని చూసి నోట మాట రాలేదు.

శంకరయ్య ఏమి చెప్పలేదు.

బుచ్చిరెడ్డిని మంచంలో పడుకోబెట్టి శంకరయ్య వెళ్లిపోయాడు...

సుగుణమ్మ బుచ్చిరెడ్డి ఒళ్లు తడిమి చూసింది. చల్లగా చల్లారిపోయి ఉన్నాడు. కళ్లు చూసన్తానే వున్నాయి. గంట తరువాత కళ్లు తెరిచి,

"సుగుణా నువ్వు తిన్నవా?" అన్నాడు.

"ఏమయ్యింది," సుగుణమ్మ మీదపడి ఏడుస్తూ.

"ఏంకాలే. గేరచ్చింది. రేప్పొద్దుటి వరకు బాగైతది. శంకరయ్యేడి," అన్నాడు.

శంకరయ్య బయట పడుకున్నాడు.

"పడుకోనియ్యి- నువ్వు పడుకో," బుచ్చిరెడ్డి నిండా శద్దరు కప్పుకొని పడుకున్నాడు.

సుగుణమ్మకు ఏమి అర్థంకాలేదు. బాగా అలసి పోయి ఉన్నది కనుక పడుకోగానే నిదురపోయింది.

బుచ్చిరెడ్డి - నిరంజన్ కన్నతండ్రి - తన ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన కన్నతండ్రి - చప్పుడు కాకుండా ఈ దేశంలోని కోటాను కోట్ల తండ్రుల్లాగే రోదించాడు.

*

ఈదుల వాగు ఈవలి పక్క పొలాల్లో సందడిగా ఉన్నది. మడికట్టు దున్నుతూ రైతులు ఎడ్లను అదిలి స్తున్నారు. రంగు రంగుల చీరెలు కట్టి స్త్రీలు నాట్లే స్తున్నారు.

బుచ్చిరెడ్డి బాయికాడి పొలంలో దాదాపు ముప్పయిమంది స్త్రీలు నాట్లేస్తున్నారు. కొమురమ్మ అందరిని హుషారు చేస్తూ వరినారు పంచేస్తున్నది. సుగుణమ్మ బురదలో దిగి చాతకాక ఒడ్డుమీది కెక్కింది. కుమ్మరి పోశవ్వ తన తీగెలాంటి కంఠంతో ఏదో పాటెత్తు కున్నది.

శంకరయ్య జంబు కొడుతున్నాడు. మరో మూడు నాగండ్లు కైలిచేస్తున్నాయి.

బుచ్చిరెడ్డి ఒడ్ల వెంట ఆడికీడికి తిరుగుతున్నాడు. అతనికి ఏదన్న చెయ్యాలని ఆరాటంగా ఉన్నది. కాని శంకరయ్య అతన్ని పొలంలోకి దిగనియ్యలేదు.

పిల్లలు బావికాడి జామ చెట్టుకింద ఆడు కుంటున్నారు.

పెసరు చెలుకల్లో నుండి బక్కపలుచగా ఉన్న ఒక వ్యక్తి అస్తుబిస్తుగా నడుస్తూ వస్తున్నాడు. అతని ముఖం వాడిపోయి ఉన్నది. అతని కండ్లు బాగా ఏడ్చా డేమొ ఉబ్బి ఉన్నాయి.

అతన్ని ముందుగా చూసింది బుచ్చిరెడ్డే. ఆ వచ్చేది బుచ్చిరెడ్డి మూడో కొడుకు సత్తిరెడ్డి.

బుచ్చిరెడ్డి బావి దగ్గరికి కొడుక్కు ఎదురొచ్చాడు.

"బాపూ," అంటూ సత్తిరెడ్డి తండ్రి మీదబడి ఏడ్వ బోయాడు - అతన్ని వారించి కరంటు మోటర్ షెడ్డు పక్క నిమ్మ చెట్టు కిందికి తీసుకపోయాడు.

పిల్లలు ఆటలు ఆపేసి వాళ్లిద్దరి చుట్టు మూగారు.

సత్తిరెడ్డిని కూర్చుండబెట్టి పిల్లలను జామచెట్టు కిందికి తీసుక వచ్చాడు. మళ్లీ కొడుకు దగ్గరకి వచ్చాడు.

"బాపూ తమ్ముణ్ని చెట్టుకు కట్టి కాల్చేసిండ్లట." సత్తిరెడ్డి కంఠం రుద్ధమై పోయింది.

బుచ్చిరెడ్డి మాట్లాడకుండా కూర్చున్నాడు. తండ్రి ముఖంలో ఏమార్పు లేకపోయేసరికి సత్తిరెడ్డి ఆశ్చర్య పోయాడు.

"బాపూ నీకు..."

"మా ఎరికేరా? వాడు ఇంట్ల నుంచి పోయి నప్పుడే ఎరుక- మీ చిన్నబాపు దగ్గరికి పోలీసచ్చి జేల్ల నుంచి పారిపోయిండని చెప్పిండట- మీ అమ్మకు అదే చెప్పిండు. మీ అమ్మ ఎప్పటికైనా తిరిగి వత్తడను కుంటంది- నువ్వు చెప్పకు," బుచ్చిరెడ్డి.

సత్తిరెడ్డికి మాటలు రాలేదు...

"ఇంటికాడ పిలగండ్లు బాగున్నరా?" బుచ్చిరెడ్డి మాటమారుస్తూ- సత్తిరెడ్డి మాట్లాడలేదు.

"మీ తమ్ముడు నిరంజన్ ఏమి చెప్పిండో ఎరికేనా? పుట్టుడు అందరొక్క తీర్గనే పుడ్తరట. బతుకుడు సానామంది తమకోసమే బతుకుతరట. నాకు చెప్పస్త లేదు. మీ అమ్మకు చెప్పకు. మీ అమ్మకు తన కొడుకు బతికి ఉన్నట్టుగనే ఎరిక. నాకు గంతే," బుచ్చిరెడ్డి లేచిపోయి పిల్లల దగ్గర కూర్చున్నాడు.

సత్తిరెడ్డి కళ్లు తుడుచుకున్నాడు. ఇంతలోనే సుగుణమ్మ వచ్చింది. సత్తిరెడ్డి యోగక్షేమాలడిగింది. పిల్లల గురించి అడిగింది.

"నిరంజన్ తప్పించుకున్నడట - మీ సిన్నాయినె సెప్పి పంపిండు. ఆడుంటడా? నాకొడుకు ఎట్లనైన మందిల బడుతడు. వాడెక్కడున్నా పానాలతో నున్నడు అదే పదివేలు- ఎన్నటికైనా వాని తల్లిపేగు పొర్లకపోదు- వాడు నాదగ్గరికొచ్చి సూసిపోతడు. మన పొలం ఊరోల్లు నాట్లేత్తండ్రు ఎరికేనా? వాడు ఏన్నుంచో మళ్ల ఊరోల్లను ఒక్కటి చేత్తండు," గుసగుసగా చెప్పింది...

సత్తిరెడ్డికి తన తమ్ముడు నిరంజన్‌రెడ్డిని కాల్చేశా రంటే నిజంగానే నమ్మబుద్ధి కావడంలేదు.

నాట్లకాడ పాట సాగుతూనే ఉన్నది...

*కోరాపుట్ జైలు నుండి విశాఖపట్నం కేసుకోసం తీసుకువస్తూ మార్గమధ్యంలో అడవిలో చెట్లకు కట్టి పోలీసులు కాల్చేసిన అమరులు సుచంద్ర రమణారెడ్డి స్మృతిలో...*

*సృజన మాసపత్రిక, ఫిబ్రవరి 1990*

